

గట్టు.. మిగిలితే ఒట్టు

గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ గట్టు రోజురోజుకూ తరిగిపోతోంది. నేడు నేలకు సమాంతరంగా అయ్యింది. వివరాలు 8లో ▸



రైతు సేంద్రియ సాగు చేయాలి

ప్రతీ రైతు సేంద్రియ వ్యవసాయం చేయాలని కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంబాజీ దత్తాత్రేయ నల్కర్ సూచించారు. వివరాలు 8లో ▸



లోపాలు సరిదిద్దుకుంటే

భౌతిక లోపాలను సరిదిద్దుకుంటే కూరగాయల సాగులో మంచి దిగుబడులను సాధించవచ్చు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

అక్రమ కట్టడాల తొలగింపు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని భవానీమందిరం చౌరస్తాలో నెలకొన్న అక్రమ కట్టడాలను మంగళవారం పోలీసులు తొలగించారు. జహీరాబాద్ పట్టణంలో ప్రధాన రహదారి పొడవునా అక్రమంగా షెడ్లు నిర్మించడంతో ట్రాఫిక్ సమస్య నెలకుంది. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా ఎవరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలేదు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి పట్టణంలోని భవానీ మందిరం ప్రధాన చౌరస్తాలో అక్రమ కట్టడాలు, రేకుల షెడ్లను జేసీబీ సహాయంతో తొలగించారు. అక్రమ కట్టడాలు నిర్మించి ప్రజలకు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

భట్టిని కలిసిన ఐఎన్టీయూసీ నేతలు



భట్టి విక్రమార్కను కలిసిన విద్యుత్ కార్మికులు

సంగారెడ్డి రూరల్ : జాతీయ ఐఎన్టీయూసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, భూపాల్ రెడ్డి, సురేష్, ఈశ్వరప్ప మంగళవారం ప్రగతి భవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు. ఈ సందర్భంగా విద్యుత్ కార్మికుల సమస్యలు, విద్యుత్ ఆర్టిజన్ సమస్యలను డిప్యూటీ సీఎంకు వివరించారు. దానికి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందిస్తూ త్వరలో పరిష్కరిస్తామని తెలిపారని నాయకులు చెప్పారు.

నేడు సంగారెడ్డికి ఏకసభ్య కమిషన్


ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయ సేకరణ ఏర్పాట్లలో అధికారులు



సంగారెడ్డి కలెక్టరేట్‌లో విచారణకు సిద్ధం చేసిన ఏర్పాట్లు

సంగారెడ్డి జోన్: ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అభిప్రాయ సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ నేడు సంగారెడ్డి జిల్లాకు వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్సీ డెవలప్‌మెంటు జిల్లా అధికారి అఖిలేశ్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల విచారణ కమిషన్ ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో బహిరంగ విచారణ చేపట్టనుంది. నేతలు, సభ్యుల నుంచి అభిప్రాయాలతోపాటు వినతులను స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్ హాజరు కానున్నారు. ఉమ్మడి జిల్లాల అధికారులతోపాటు సంఘాల నాయకులు, సభ్యులు కూడా హాజరు కానున్నారు. కాగా, అభిప్రాయాలను చెప్పేందుకు వచ్చిన వారికి ప్రత్యేకంగా టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాల వారీగా అధికారులతో రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అభిప్రాయాలు చెప్పాలనుకునేవారు రాతపూర్వకంగా తమ అభిప్రాయాలను నేరుగా కమిషన్‌కు అందించవచ్చు. వివిధ సంఘాల నేతలు, సభ్యుల నుంచి సేకరించిన అంశాలు, అభిప్రాయాలు, వినతులను పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి అందించనున్నారు.

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

జిన్నారం (పటాన్‌చెరు)/వట్‌పల్లి (అందోల్): జిన్నారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేదని తెలుపడంతో వారం రోజు ల్లో మరమ్మతు పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అనంతరం వంటగదిని, సామగ్రిని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల బోధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు.

అక్షర స్కూలు ఘటనపై విచారణకు ఆదేశం

శనివారం వట్‌పల్లిలోని అక్షర స్కూల్‌లోని ఏడో తరగతి చదువుతున్న నవీన్ అనే విద్యార్థిపై ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అహ్మద్ గాయపరిచిన ఘటనపై వెలుగులోకి రావడంతో డీఈవో స్పందించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి, సమగ్ర నివేదికను అందజేయాలని ఎంఈవో గోవింద్‌రెడ్డిని ఆదేశించారు. అక్షర స్కూల్‌లో జరిగిన ఘటనలో బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అందోల్ రూపురేఖలు మార్చేస్తా

ఏడాదిలో రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు

- రూ.160 కోట్లతో సింగూరు కాలువ లైనింగ్ పనులు
- రూ.87 కోట్లతో 'నర్సింగ్ కళాశాల'.. 150 పడకల ఆస్పత్రి
- నియోజకవర్గాన్ని పదేళ్లు నిర్లక్ష్యం చేశారు
- మంత్రి దామోదర రాజనర్సింహ

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావస్తోంది. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల అభివృద్ధి, నెలకొన్న సమస్యలు, స్థానిక ప్రజాప్రతినిధుల పనితీరుపై 'సాక్షి'ఫోకస్ చేసింది. అందోల్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఉపముఖ్యమంత్రిగా, మంత్రిగా కీలక పదవులను చేపట్టిన దామోదర రాజనర్సింహ ప్రస్తుతం కీలకమైన వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖలను నిర్వర్తిస్తున్నారు. పలు అభివృద్ధి పనులను చేపడుతూ నియోజకవర్గం రూపురేఖల్నే మార్చేస్తానంటున్న మంత్రి తన అభివృద్ధి ప్రణాళికల గురించి 'సాక్షి'తో ముచ్చటించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...



పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో మాటా ముచ్చట రేపటి సంచికలో

జోగిపేట(అందోల్): పదేళ్ల కాలంలో అందోల్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోక పూర్తిగా వెనుకబడింది. నియోజకవర్గంలో నెలకొన్న ప్రతీ సమస్య నాకు తెలుసు. వాటి పరిష్కారానికి నావంతు కృషి చేస్తున్నాను. నియోజకవర్గంలో రోడ్లు పూర్తి అధ్వానంగా ఉన్నాయి. విద్యా సంస్థలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. వైద్య ఆరోగ్య మంత్రిగా ప్రజారోగ్యం నా తొలి ప్రాధాన్యం. అందుకే నర్సింగ్ కళాశాల, 150 పడకల ఆస్పత్రి, జోగిపేటల కొత్త మున్సిపల్ భవనం ఏర్పాటుకు పనులు సాగుతున్నాయి. దాంతోపాటుగా సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో కూడా శరవేగంగా అభివృద్ధి పనులను చేపట్టాం. అందులో భాగంగా సుల్తాన్‌పూర్‌లోని జేఎన్టీయూలో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నాం. రెండేళ్లలోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తూ రూపురేఖలు మార్చేస్తాను.



పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ సమస్యకు చెక్..

నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. డాకూరు ప్రాంతంలో ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు అవకాశాలు కల్పించాలన్న ఆలోచన ఉంది. ఆ దిశగా కూడా నా వంతు ప్రయత్నాలు చేస్తున్నాను. ఇచ్చిన హామీల మేరకు పనిచేస్తూనే కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నాను.

ప్రజారోగ్యం గురించి....



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలోనే అందోల్ నియోజకవర్గంలో రూ.43 కోట్లతో నర్సింగ్ కళాశాల, రూ.44 కోట్లతో 150 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, టేక్మాల్, వట్‌పల్లి మండలంలో పీహెచ్‌సీ కేంద్రాల మంజూరు చేయించాను. వాటి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి అభివృద్ధికి రూ.2.15 కోట్ల నిధులు కూడా మంజూరు చేయించాను. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు ఉచితంగా సేవలు, 7,750 వైద్య శాఖలో ఉద్యోగాల భర్తీకి చర్యలు, రాష్ట్రంలో 8 కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటు, 16 డయాలసిస్ సెంటర్‌ల ఏర్పాటు, 74 ట్రామా కేర్‌ల ఏర్పాటుకు నిర్ణయం, 30 కోట్లతో 222 అంబులెన్స్‌ల ఏర్పాటు చేయించాను.

రోడ్ల అభివృద్ధిపై...

రూ.కోట్లతో అజ్జమర్రి-జోగిపేటల మధ్య వంతెనతోపాటు పట్టణంలోకి మూడు రోడ్ల ఏర్పాటుకు రూ.79 కోట్లు నిధులు తెచ్చాను. అందోల్ శివారు నుంచి అన్నాసాగర్ వరకు రూ.21 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాం. రాయికోడ్, పుల్కల్, అందోలు, మునిపల్లి మండలాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అందుకే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని రహదారుల మరమ్మతులకుగాను రూ.25.08 కోట్లు మంజూరు చేయించాను. పనులు టెండర్లు పూర్తయిన తర్వాత ప్రారంభమవుతాయి.



సింగూరు ప్రాజెక్టుపై....

సింగూరు ప్రాజెక్టు హైదరాబాద్ జంట నగరాలకు దగ్గరగా ఉన్నందువల్ల దీనికి పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులను కేటాయిస్తున్నాం. ప్రాజెక్టులో బోటింగ్‌ను నిర్వహిస్తాం. సింగూరు గురించి ఇంకా చెప్పాలంటే దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి మంజూరు చేసిన నిధులతో తొలుత కాలువల నిర్మాణం చేపట్టాం. అప్పటి నుంచి ఇప్పటివరకు కాలువల గూర్చి పట్టించుకునే నాథుడే లేడు. ప్రస్తుతం రూ.160 కోట్లతో కాలువలను కాంక్రీట్ లైనింగ్ పనులు చేపడతాం.

విద్యపై...



ఏ దేశమైనా ప్రజలకు అందించే నాణ్యమైన విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుంది. విద్య అందుబాటులో ఉంటే ప్రజలు చైతన్యవంతులవుతారు. విద్యలో రాణించి తమ కాళ్లపై నిలబడి దేశానికి ఆర్థికవనరులుగా మారతారు. అందుకే అందోల్‌లో నర్సింగ్ కళాశాలను మంజూరు చేయించాను. సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో రూ.6కోట్లతో సైన్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. త్వరలోనే వీటి పనులు మొదలు కాబోతున్నాయి.



జేఎన్టీయూ కళాశాల (ఫైల్)

సైన్స్ సెంటర్‌కు రూ.6.65కోట్లు

- రాష్ట్ర ఆర్థిక శాఖ ఆమోదం
- మంత్రి దామోదర ప్రత్యేక కృషి

జోగిపేట(అందోల్): సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలోని జేఎన్టీయూ క్యాంపస్‌లో ఐదెకరాల స్థలంలో ఏర్పాటు చేయబోయే సైన్స్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ఆర్థికశాఖ రూ.6.65 కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు జీవో నంబరు 151 ను విడుదల చేసింది. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీజీసీవోఎస్టీ) ఆధ్వర్యంలో అండర్ కేటగిరీ- థర్డ్ టైప్ 'బీ'లో భాగంగా సైన్స్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నిర్ణయం తెలిసిందే. అయితే ఈ కేంద్రం ఏర్పాటుపై రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిగా ఉండటంతో దామోదర రాజనర్సింహ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు.

సైన్స్ కేంద్రంతో ఇవీ ఉపయోగాలు...

సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయడంతోపాటు విజ్ఞానాన్ని ప్రదర్శించడానికి ఇదో వేదికలా ఉపయోగపడుతుంది. విద్యార్థులకు ఫిజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఎలక్ట్రానిక్స్, లైఫ్ సైన్సెస్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ విభాగాలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవచ్చు. వైజ్ఞానిక ప్రదర్శనలు, సైన్స్ పోటీలు, ఆయా అంశాలపట్ల చర్చోపచర్చలు, క్విజ్ పోటీలు, సెమినార్లు, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి చక్కటి వేదికలుగా నిలుస్తాయి.

ఐదెకరాలు కేటాయింపు



జేఎన్టీయూ కళాశాలలో సైన్స్ సెంటర్ కోసం ఐదెకరాలు కేటాయించాం. ప్రభుత్వం నిధులు కూడా కేటాయించింది. క్లాక్ టవర్, ఆడిటోరియం, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టుల ఏర్పాటు కూడా మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు స్థలాన్ని ఎంపిక చేశారు. ఎకరా స్థలంలో ఆడిటోరియం నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. సైన్స్ సెంటర్ ఏర్పాటు వల్ల విద్యార్థులకు చాలా రకాలుగా ప్రయోజనం చేకూరుతుంది.

డాక్టర్ జి. నర్సింహ, ప్రిన్సిపాల్ జేఎన్టీయూ

క్రీడలతో మానసిక ఆరోగ్యం



2 కే రన్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్ తదితరులు

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్: క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఆరోగ్యం కూడా లభిస్తుందని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం సంగారెడ్డిలో క్రీడా పోటీలు నిర్వహించారు. సీఎం కప్2024 2కే రన్, వాలీబాల్‌తోపాటు వ్యాయామం నిర్వహించారు. ఐబీ నుంచి అంబేడ్కర్ స్టేడియం వరకు సాగిన 2కే రన్‌ను అధికారులతో కలసి చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవడం ప్రస్తుత తరుణంలో అత్యంత అవసరమన్నారు. యువతలో ఉత్తేజాన్ని పెంచే విధంగా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి, జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి ఖాసీం బేగ్, టీజీఈజేఏసీ చైర్మన్ ఏం.డి జావీద్ అలీ, ఇతర ఉన్నతాధికారులు, వివిధ యువజన సంఘాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంచనాలు తారుమారు

ధాన్యం కొనుగోళ్లలో తప్పిన సర్కార్ అంచనాలు

- నిర్దేశిత లక్ష్యానికి ఆమడ దూరంలోనే నిలిచిన కొనుగోళ్లు
- కొనుగోలుకు 2.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనా
- కేంద్రాలకు వచ్చింది కేవలం 1.46 ఎల్ఎంటీలలోపే
- చివరి దశకు చేరిన సేకరణ ప్రక్రియ



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : వరిధాన్యం కొనుగోళ్లలో ఈ సీజను వేసిన సర్కారీ అంచనాలు తల్లకిందులయ్యాయి. ధాన్యం పరిమాణం విషయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ వేసిన కొనుగోళ్ల అంచనాలు ఆ మేరకు కూడా అందుకోలేదు. ఈ సీజనులో సుమారు 2.11లక్షల మెట్రిక్ టన్ను (ఎల్ఎంటీ)ల ధాన్యం కొనాల్సి ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. కానీ ఇప్పటివరకు కేవలం 1.46 లక్షల మెట్రిక్ టన్నులు కూడా దాటకపోవడం గమనార్హం. అంటే దాదాపు 60 వేలకు పైగా మెట్రిక్ టన్నులు (మూడో వంతు) తేడా వచ్చింది. దీంతో సర్కారు నిర్దేశించుకున్న లక్ష్యానికి కొనుగోళ్లు ఆమడదూరంలోనే నిలిచిపోయాయి.

ఆ రెండు జిల్లాలతో పోలిస్తే సాగు తక్కువే....

మెదక్, సిద్దిపేట జిల్లాలతో పోల్చితే సంగారెడ్డి జిల్లాలో వరి సాగు విస్తీర్ణం తక్కువే ఉంటుంది. అయితే ఈసారి సన్న, దొడ్డు రకాలు కలిపి 1.38 లక్షల ఎకరాల్లో (55,448 హెక్టార్లలో) వరి సాగైనట్లు ఈ శాఖ అధికారులు అంచనా వేశారు. ఆయా మండలాల్లోని వ్యవసాయ క్లస్టర్లలో వచ్చే పంట దిగుబడులను ఆధారంగా చేసుకుని మొత్తం 3.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతుందని లెక్కగట్టారు. ఈ ధాన్యంలో సన్న రకం ధాన్యం సుమారు 60 వేల మెట్రిక్ టన్నులు రైతులు తమ వినియోగం కోసం వాడుకుంటారని, అలాగే విత్తనాల కోసం మరో 47 వేల మెట్రిక్ టన్నులు రైతులు తమ వద్ద ఉంచుకుంటారని అంచనా వేశారు. మిగిలిన 2.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని లెక్కగట్టారు. కానీ ఇప్పటివరకు 1.46 ఎల్ఎంటీల ధాన్యం మాత్రమే కొనుగోళ్లు జరిగాయి.

చివరి దశకు ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ చివరి దశకు చేరింది. ఇప్పటికే 70 శాతానికి మించి కొనుగోలు కేంద్రాలను మూసివేశారు. నడుస్తున్న కేంద్రాల్లో సైతం నామమాత్రంగానే ధాన్యం వస్తోంది. సన్న రకం సేకరణ కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలన్నింటినీ మూసివేశారు. మరో వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి కానున్నాయి. ఈ ప్రక్రియ కూడా పూర్తయితే సేకరణ 1.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు వెళ్తుందని భావిస్తున్నారు.

దిగుబడుల ఆధారంగా..

వ్యవసాయశాఖ ఏటా వరి సాగు విస్తీర్ణం ఆధారంగా ధాన్యం రాకపై అంచనాలు తయారు చేస్తుంది. ఆయా మండలాల్లో వచ్చే దిగుబడులను కూడా పరిగణలోకి తీసుకుంటారు. క్లస్టర్ల వారీగా దిగుబడుల సగటు ఆధారంగా జిల్లా సగటు దిగుబడిని లెక్కిస్తుంటారు. అయితే ముందు జాగ్రత్తగా వాస్తవ పరిస్థితులకు అదనంగా కనీసం ఐదు నుంచి పది శాతం ఎక్కువే ధాన్యం వస్తుందని అధికారులు అంచనాలు తయారు చేస్తుంటారు. అలా చేస్తేనే కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటే సేకరణ సాఫీగా సాగుతుందని భావిస్తుంటారు. వచ్చే ధాన్యం మేరకు గన్నీ బ్యాగులు, కాంటాలు, రవాణా, హమాలీలు, టార్పాలిన్‌లు, కొనుగోలు కేంద్రాలు వంటి ఏర్పాట్లు చేసుకుంటారు. కానీ ఏకంగా సుమారు 30 శాతానికి మించి అంచనాలు తప్పడం అధికారులను ఆలోచనలో పడవేస్తోంది.

బయట అమ్ముకోవడంతోనే


జిల్లా వ్యాప్తంగా సాగైన పంటల తీరుపై ఏటా క్రాప్ బుకింగ్ ప్రక్రియ చేపడతాం. ఈ బుకింగ్‌ను బట్టి సాగు విస్తీర్ణం లెక్కిస్తాం. ఈసారి కొందరు రైతులు బహిరంగ మార్కెట్‌లో ధాన్యం విక్రయించడంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం అంచనాల్లో తప్పాయి. రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకుంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపై కొంత ఒత్తిడి తగ్గుతుంది.

–కె.శివప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖాధికారి.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు

వట్‌పల్లి(అందోల్): ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ విజ్ఞప్తి చేశారు. అందోల్ మండల పరిధిలోని తాలెల్మ పీహెచ్‌సీ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేల చెల్లించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లెప్రసీ, పల్స్ పోలియో, క్షయ తదితర సర్వేల బకాయి గౌరవవేతనం చెల్లించాలన్నారు.



వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు

- టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి
- సంగారెడ్డిలో ఘనంగా అర్బన్ డే

సంగారెడ్డి జోన్: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి వెల్లడించారు. ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సంగారెడ్డి పట్టణంలో అంబేడ్కర్ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో అర్బన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు టీజీఐఐసీ చైర్ పర్సన్‌తోపాటు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతితో పాటు అధికారులు హాజరయ్యారు. ఇందిరా మహిళా శక్తి 8 గ్రూపుల సభ్యులకు రూ.2కోట్లు, 24 మంది వీధి వ్యాపారులకు రూ.5 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా మున్సిపల్ కార్మికులకు సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మలారెడ్డి మాట్లాడుతూ మహిళ ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తే ఇల్లు, గ్రామం, దేశం బాగుపడుతుందన్నారు. అన్ని రంగాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. శివసేన రెడ్డి మాట్లాడుతూ..దేశంలో ఎక్కడాలేని విధంగా ఏడాది కాలంలోనే 50 వేలకు పైగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. పదేళ్ల టీఆర్ఎస్ పాలనలో లక్షకు పైగా ఉద్యోగాలు కల్పించలేకపోయారని విమర్శించారు. కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ...కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకనుగుణంగా మహిళలకు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వ్యాపార యూనిట్లను ప్రారంభింపజేస్తామని తెలిపారు. రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ చౌహాన్ ప్రసాద్ పాల్గొన్నారు.



మహిళా సంఘాల సభ్యులకు చెక్కును అందిస్తున్న జిల్లా కలెక్టర్ క్రాంతి

క్లుప్తంగా

కమీషన్ పేరుతో మోసం

రూ.1.75 లక్షలు పోగొట్టుకున్న ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: కమీషన్ పేరుతో నగదు కాజేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి జూలై 15వ తేదీన నగదు ఇన్వెస్ట్ చేస్తే కమీషన్ ఇస్తామంటూ అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. దీనికి స్పందించిన ఉద్యోగి పలు దఫాలుగా అపరిచిత వ్యక్తికి రూ.1.75 లక్షలు వేశాడు. ఇంకా నగదు వేయాలని అపరిచిత వ్యకి పదే పదే అడగడంతో అనుమానం వచ్చిన ఉద్యోగి తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడిగాడు. దీంతో అతడు స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, మంగళవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లీ, కుమారుడు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: తల్లీ, కుమారుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వర్ రావు కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కి చెందిన గౌస్ సోదరి నసీమా బేగం, ఆమె కుమారుడు జునైద్ (11) గత నెల 29న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. నసీమా భర్త చనిపోవడంతో నాలుగేళ్లుగా సోదరుడి ఇంటి పక్కనే నివాసం ఉంటుంది. ఈ క్రమంలో గౌస్ ఇద్దరి కోసం చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించక పోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మృతురాలి ఆచూకీ లభ్యం

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం నస్తిపూర్ గ్రామ శివారులో 1వ తేదీన దారుణ హత్యకు గురైన మహిళ ఆచూకీ లభ్యమైంది. హత్నూర ఎస్సై సుభాష్ మంగళవారం రాత్రి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని మహిళ మృతదేహంగా కేసు నమోదు చేసి ముమ్మరంగా దర్యాప్తు చేపట్టగా మృతురాలు పుల్కల్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన గొల్ల లలిత (50) భర్త లింగమయ్యగా గుర్తించాం. మృతురాలు ఇంటి నుంచి బయలుదేరి సంగారెడ్డి బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కినట్లు తెలిసిందని, హత్యకు గల కారణాలను తెలుసుకొని నిందితులను పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్తి తగాదాలే కారణం అన్నట్లుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుర్‌కురే ప్యాకెట్లు సీజ్


సీజ్ చేసిన వాటిని చూపుతున్న అధికారులు

మనోహరాబాద్(తూప్రాన్): తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాలతో ఫుడ్ టాస్క్ ఫోర్స్ అధికారులు మండలంలోని కాళ్లకల్ పరిశ్రమల వాడలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ అధికారి, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో కాళ్లకల్‌లోని సన్ని ఫుడ్స్ మాన్యుఫాక్చర్ యూనిట్‌లో ఈ తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా నాణ్యత లేని కుర్‌కురే ప్యాకెట్లు, మసాల ప్యాకెట్లు తయారీని గుర్తించారు. లైసెన్స్ లేకుండా తయారీ చేయడం, స్టోరేజ్, విక్రయ యూనిట్‌లను నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో ప్యాక్ చేసిన వాటిని సీజ్ చేసి, నోటీసులను అందించామని, వాటి విలువ రూ.2,13,250 ఉంటుందని తెలిపారు. సీజ్ చేసిన ఆహార నమూనాలను పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌రెడ్డి, స్వాతి, శ్రీశిక ఉన్నారు.

గట్టు.. మిగిలితే ఒట్టు

మాయమైపోతున్న గౌరవెల్లి ప్రాజెక్ట్ కాల్వ గట్లు

- అనుమతి గోరంత.. తవ్వేది కొండంత
- నిత్యం టిప్పర్లలో తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
- కాల్వ హద్దులు తొలగడంతో అక్రమణకు గురవుతున్న భూమి
- పట్టించుకోని పలు శాఖల అధికారులు


రాంచంద్రపూర్ శివారులో నేలకు సమాంతరంగా కాల్వ గట్టు

గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ గట్టు రోజురోజుకూ తరిగిపోతోంది. కాల్వ తవ్వకం జరిగినప్పుడు ఇరువైపులా మట్టి గుట్టలను తలపించేది. కానీ నేడు నేలకు సమాంతరంగా అయ్యింది. గోరంత అనుమతి తీసుకొని కొండంత తవ్వేస్తున్నారు. ప్రభుత్వ అనుమతుల పేరుతో వందలాది టిప్పర్లలో మట్టిని తరలించేస్తున్నారు. ప్రాజెక్టు కెనాల్ తవ్వకం ప్రారంభం నాటి నుంచి ఈ మట్టి అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. ప్రభుత్వం మారిన, మనుషులు మారిన మట్టి తవ్వకాలు ఏ మాత్రం ఆగడం లేదు. అధికారులు సైతం చూసిచూడనట్లుగా ఉండటంతో కాల్వ గట్టు కనుమరుగవుతూ వస్తోంది.

– కోహెడరూరల్(హుస్నాబాద్)

బెజ్జంకి మండలం తోటపల్లి చెరువు నుంచి హుస్నాబాద్ గౌరవెల్లి ప్రాజెక్టుకి నీటిని మళ్లించేందుకు కోహెడ మండలం రాంచంద్రపూర్, చిగురుమామిడి మండలం ఓగులాపూర్ మీదుగా సుమారు 8 కిలో మీటర్ల మేర కాల్వను తీశారు. తవ్వాకల్లో వచ్చిన మట్టిని కాల్వకు రెండు వైపులా 50 అడుగుల ఎత్తులో పోశారు. ఈ మట్టిపై కన్ను పడ్డ అక్రమార్కులు, కాంట్రాక్టర్లు ఇష్టారీతిన తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తున్నారు.

రోడ్డు విస్తరణ పేరుతో..

కెనాల్‌కు ఇరువైపులా ఉన్న మట్టితో ప్రభుత్వానికి భారీ ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా అధికారుల లోపంతో గండి పడుతుంది. ఇరిగేషన్ అధికారులు ఇష్టారాజ్యాంగ అనుమతులు ఇవ్వడంతో కాల్వ చుట్టూ ఎత్తైన గుట్టలుగా ఉన్న మట్టి సంగానికి పైగా మాయం అయ్యింది. ఇటీవల కోహెడ మండలంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ నిర్మాణ పనులకు ఇక్కడి నుంచే మట్టి తీసుకెళ్లడానికి అధికారులు అనుమతి ఇచ్చారు. కానీ అధికారుల పర్యవేక్షణ లోపంతో తీసుకున్న దానికంటే అధికంగా మట్టిని తవ్వి హద్దులు లేకుండా చేస్తున్నారు.

అనుమతులు ఉన్నాయంటూ..

కెనాల్ నుంచి తవ్విన మట్టిని మరో ప్రాంతానికి తరలించాలంటే కచ్చితంగా ఇరిగేషన్, మైనింగ్ శాఖల అనుమతులు తప్పనిసరి. వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వకాలకు ఇరిగేషన్ శాఖ నుంచి 15 రోజులకు గాను 5 వేల క్యూబిక్ సెకల అనుమతులు పొందారు. కానీ మైనింగ్‌శాఖ నుంచి అనుమతులు పొందకుండానే


మట్టిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాలు

తవ్వకాలు జరుపుతున్నారు. ఇదేంటని స్థానికులు ప్రశ్నిస్తే మాకు అనుమతులు ఉన్నాయంటూ తమ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. నియోజకవర్గ స్థాయి ముఖ్య ప్రజాప్రతినిధి అండదండలతో ఈ దందాకు పాల్పడుతున్నట్లు పలువురు చెబుతున్నారు.

అనుమతి లేకుంటే చర్యలు

గౌరవెల్లి ప్రాజెక్ట్ కెనాల్ కాల్వకు సంబంధించిన మట్టిని రోడ్డు విస్తరణకు తరలించేందుకు 15 రోజులు మాత్రమే అనుమతి ఇచ్చాం అంతకు మించి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం. అలాగే, కెనాల్ వెంట హద్దులు ఏర్పాటు చేయలేదు. ఇందుకోసం ప్రభుత్వానికి నివేదించాం. అనుమతి రాగానే ఏర్పాటు చేస్తాం. కెనాల్‌కి సంబంధించిన భూమిని చుట్టుపక్కల రైతులు ఆక్రమించొద్దు.

– అజీజ్, ఇరిగేషన్ జేఈ

మాదంటే మాది కాదు

నిబంధనల ప్రకారం ఈ కెనాల్ మట్టిని తరలించాలంటే రెవెన్యూ, మైనింగ్ అధికారులకు, ఇరిగేషన్ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ ఇది కెనాల్ మట్టి కాబట్టి ఇరిగేషన్ శాఖ అధీనంలో ఉండటంతో పరివేక్షణ లోపంతో అక్రమార్కులకు వరంలా మారింది. మట్టి తరలింపుపై ఫిర్యాదు చేసినా ఆయా శాఖల నుంచి ఎలాంటి స్పందన లేకపోగా మా పరిధిలోకి రాదంటూ దాటవేస్తున్నారు. ఏది ఏమైనా అధికారుల సమన్వయ లోపంతో రూ.లక్షలు విలువ చేసే మట్టిని పక్కదారి పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకొని మట్టి అక్రమ తవ్వకాలను నియంత్రించాలని కోరుతున్నారు.

స్కూల్ నుంచి బాబును తీసుకొస్తుండగా..

మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ

పటాన్‌చెరు టౌన్: మహిళ మెడలో నుంచి గొలుసు దొంగలించిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ఎన్‌ఆర్‌ఐ కాలనీకి చెందిన గొల్ల భాగ్యమ్మ మంగళవారం మధ్యాహ్నం స్థానికంగా ఉన్న ప్రైవేట్ స్కూల్‌కి వెళ్లి కుమారుడు నవనీత్‌ని తీసుకొని ఇంటికి వెళ్తుంది. మార్గమధ్యలో వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఆమె మెడలోని పుస్తెలతాడు తెంపుకొని పరారయ్యాడు. బాధితురాలు భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో..

రామాయంపేట(మెదక్): తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని బాపనయ్య మోతుకుల తండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తండాకు చెందిన దుర్గ్య హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమారుడికి రోడ్డు ప్రమాదం జరిగిందని రెండు రోజుల కిందట కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. తిరిగి మంగళవారం ఇంటికి రాగా తాళం తీసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచి ఉంచిన బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితుడు దుర్గ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రతీ రైతు సేంద్రియ సాగు చేయాలి



- కేవీకే శాస్త్రవేత్త దత్తాత్రేయ నల్కర్
- రైతులకు వరి విత్తనాలు, నారు మడులు పంపిణీ


కేవీకేలో రైతులకు వేప నూనె పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతీ రైతు సేంద్రియ వ్యవసాయం చేయాలని కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంబాజీ దత్తాత్రేయ నల్కర్ సూచించారు. మంగళవారం మండలంలోని తునికి వద్ద గల డాక్టర్ డీ.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక ఇన్‌చార్జి, ఉద్యానవన శాస్త్రవేత్త ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోతిరెడిపల్లి గ్రామ ఎస్సీ రైతులకు 20 కిలోల వరి విత్తనాలు, జీవన ఎరువులు, వేపనూనె, టమాట, మిరప కూరగాయల నారు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ నల్కర్ మాట్లాడుతూ.. ప్రతీ రైతు కనీసం ఇంటి అవసరాల కోసమైనా సేంద్రియ సాగు చేయాలని సూచించారు. ఎస్సీ రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కేవీకే ఆధ్వర్యంలో సేంద్రియ, పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస్, భార్గవి, వినాయక సేంద్రియ సహకారం సంఘం చైర్మన్ ప్రభాకర్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

బిల్లులు ఇస్తారా? ఆత్మహత్య చేసుకోమంటారా?

బాలికల పాఠశాలకు తాళం వేసిన ఎస్‌ఎంసీ ఛైర్మన్లు


ధర్నా చేస్తున్న ఎస్‌ఎంసీ ఛైర్మన్లు

మెదక్ మున్సిపాలిటీ: అప్పులు చేసి పాఠశాలల నిర్మాణాలు చేస్తే బిల్లులు మంజూరు చేయకుండా ప్రభుత్వం తీవ్ర మానసిక క్షోభకు గురి చేస్తుందని, బిల్లులు మంజూరు చేయకుంటే మాకు ఆత్మహత్యే గతని ఎస్‌ఎంసీ చైర్మన్లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మన ఊరు–మనబడి బిల్లుల కోసం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు తాళం వేసి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన ఊరు–మన బడి పథకంలో పనులు చేసి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని మండి పడ్డారు. వందలసార్లు కలెక్టర్లకు, డీఈఓకు వినతులు అందజేసినప్పటికీ బిల్లులు మాత్రం మంజూరు చేయడం లేదన్నారు. మేము నిర్మించిన పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో రంగులు వేయించి వారికి డబ్బులు ఇస్తున్నారని వాపోయారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి నిర్మాణాలు చేస్తే మాకు బిల్లులు ఇవ్వకుండా క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు తాళం వేయడంతో విద్యార్థులంతా రోడ్డుపైన నిలబడిపోయారు. పాఠశాల హెచ్‌ఎం రేఖ విషయాన్ని ఎంఈఓ నీలకంఠం తెలుపగా అక్కడికి చేరుకొని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని వారిని సముదాయించి ధర్నా విరమింపజేశారు. అనంతరం పాఠశాలకు తాళం తీశారు.

జనవరి 11న బాడీ బిల్డింగ్ పోటీలు

సిద్దిపేటజోన్: జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 11న జిల్లా కేంద్రంలో బాడీ బిల్డింగ్ పోటీలు, ఎంపికలు ఉంటాయని అసోసియేషన్ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక విపంచి ఆడిటోరియంలో వచ్చే ఏడాది జనవరి 11 (శనివారం)న సాయంత్రం 6 గంటలకు బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించి మిస్టర్ సిద్దిపేట కోసం ఎంపిక ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. 50 నుంచి 55 కిలోలు, 55 నుంచి 60, 60 నుంచి 65, 65 నుంచి 70, అదే విధంగా 80 నుంచి 85 కిలోల బరువు కేటగిరీలుగా పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ఉంటాయని, అనంతరం మిస్టర్ సిద్దిపేట ట్రోఫీ గెలిచిన వారికి నగదు పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట్ స్వామి, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సత్యం గౌడ్, సిద్దులు, శేఖర్, సాఖత్, అఫ్సర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైల్వే లైన్ విద్యుద్దీకరణ పనులు

రైల్వే డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయ్


అక్కన్నపేట రైల్వే స్టేషన్‌లో లోకేష్ విష్ణోయ్

రామాయంపేట(మెదక్): మండల పరిధిలోని అక్కన్నపేట రైల్వేస్టేషన్‌ను మంగళవారం దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయ్ పరిశీలించారు. స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ నుంచి ముత్కేడ్ వరకు 221 కిలో మీటర్ల మేర రైల్వే లైను విద్యుద్దీకరణకు రూ.2,300 కోట్లు మంజూరయ్యాయన్నారు. పనులు కొనసాగుతున్నాయని తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అక్కన్నపేట–మెదక్, మనోహరాబాద్– కొత్తపల్లి లైనులో విద్యుద్దీకరణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అక్కన్నపేట స్టేషన్‌లో నెలకొన్న నీటి ఎద్దడి సమస్యను పరిష్కరిస్తామని డీఆర్‌ఎం హామీ ఇచ్చారు. ఆయన వెంట డీసీఎం అనురుధ్, డీఎస్‌వో విజయకుమార్, డీఈఈ విష్ణు చైతన్య, ఇతర అధికారులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయికి సైన్స్ ప్రదర్శనలు

నర్సాపూర్: రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని పట్టణంలోని శ్రీ విష్ణు ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ జామి మంగళవారం తెలిపారు. ఇటీవల మెదక్‌లో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో తమ పాఠశాలలో 8వ తరగతి చదివే యశశ్రీ, శ్రీచంద్ర అగ్ని పర్వత విస్ఫోటనం అనే అంశంపై ప్రదర్శించారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని దక్కించుకొని రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు అభినందించారు.

టేక్మాల్(మెదక్): రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు

విద్యార్థులకు అభినందనలు

టేక్మాల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. పాఠశాలలో 10వ, 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీలు ఐశ్వర్య, రేణుక అంతరించిపోతున్న జీవరాశుల రక్షణ అనే అంశంపై ప్రదర్శనను ఏర్పాటు చేసి ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతోపాటు సైన్స్ టీచర్ ఉమా మహేశ్వరరాజ్‌ను పాఠశాల తరఫున అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బాలమణి ఘనంగా సన్మానించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

బిహార్ టు చిన్నశంకరంపేట

- భారీగా గంజాయి తీసుకొచ్చి విక్రయం
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటరాజంగౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): గంజాయి విక్రేతను పోలీసులు పట్టుకున్న ఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మంగళవారం చిన్నశంకరంపేటలో రామాయంపేట సీఐ వెంకటరాజంగౌడ్ వివరాలు వెల్లడించారు. బిహార్ రాష్ట్రంలోని చాప్రా సారన్ జిల్లా భగవాన్ పూర్ గ్రామానికి చెందిన సూరజ్ కుమార్ స్థానిక రాధా స్టీల్ పరిశ్రమలో ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. చిన్నశంకరంపేటలో నివాసం ఉంటూ గంజాయికి అలవాటు పడిన సూరజ్ అక్టోబర్‌లో బిహార్ నుంచి ఒకేసారి పెద్ద మొత్తంలో ఇక్కడికి తీసుకొచ్చాడు. సిగరేట్‌లో గంజాయిని నింపుకొని సేవించడంతోపాటు తోటి కార్మికులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. సోమవారం రాత్రి మండల కేంద్రంలోని పద్మనాభస్వామి గుట్ట సమీపంలోని మీర్జాపల్లి ఎక్స్ రోడ్ వద్ద బ్యాగులో గంజాయితో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో పేట ఎస్‌ఐ నారాయణగౌడ్ తన సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. బ్యాగులో 512 గ్రాములు ఉన్నట్లు గుర్తించి వెంటనే సూరజ్‌ను అదుపులోకి తీసుకొని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును చేగుంట ఎస్‌ఐ చైతన్యరెడ్డి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్కూల్ బస్సు, ఆటో ఢీ

డ్రైవర్, విద్యార్థులకు స్వల్పగాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

పాపన్నపేట(మెదక్): స్కూల్ బస్సు, ఆటో ఢీకొన్న ఘటన పాపన్నపేట మండలం ఎల్లాపూర్ బ్రిడ్జిపై మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సంగన్న కథనం మేరకు.. మెదక్ పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు విద్యార్థులను తీసుకొని పాపన్నపేట వైపు వస్తుంది. ఈ క్రమంలో ఎల్లాపూర్ వైపు నుంచి మెదక్ వెళ్తున్న సిమెంట్ ఆటో ఎల్లాపూర్ బ్రిడ్జిపైకి రాగానే టైర్ పగలడంతో కుడివైపు వెళ్లి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తుమ్మలపల్లికి చెందిన ఆటో డ్రైవర్ ఎల్లన్నోల్ల సాయిలుకు గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బస్సులో సుమారు 50 మందికి పైగా పిల్లలుండగా ఒకరిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పాపన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

సెల్ టవర్‌ల బ్యాటరీలు చోరీ

ఆరుగురు నిందితులు అరెస్టు


బ్యాటరీలు చూపుతున్న పోలీసులు

గజ్వేల్‌రూరల్: సెల్ టవర్‌ల బ్యాటరీలు చోరీకి పాల్పడుతున్న నిందితులను పోలీసులు పట్టుకున్నారు. గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా లాల్‌గాడి మలకోపేట్‌కు చెందిన బదావత్ కృష్ణ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని రాడగంబ బస్తీలో నివాసముంటున్నాడు. అతడి కుమారుడు (మైనర్)తోపాటు మంచిర్యాల జిల్లా కిష్టంపేటలోని ఎల్లక్కపేటకు చెందిన సతీష్, నస్పూర్‌లోని ఆర్‌కే 5కాలనీకి చెందిన ఇస్లావత్ రమేశ్, బెల్లంపల్లిలోని రడగంబ బస్తీకి చెందిన లావుడియా శంకర్‌లు పని కోసం మేడ్చజ్–మల్కాజ్‌గిరి జిల్లాలో ఉంటున్నారు. గతంలో సెల్ టవర్‌లకు బ్యాటరీలను ట్రాన్స్‌పోర్ట్ చేయగా సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో వీరంతా బృందాలుగా ఏర్పడ్డారు. గజ్వేల్, కుకునూర్‌పల్లి, ములుగు, మనోహరాబాద్, షామీర్‌పేట్, శివ్వంపేట, శంషాబాద్, చేగుంట పోలీస్ స్టేషన్ల పరిధిలో సెల్ టవర్‌ల బ్యాటరీలను చోరీ చేసి మేడ్చల్ జిల్లా కిష్టాపూర్ ప్రాంతానికి చెందిన దుద్దెడ లింగం స్క్రాప్ దుకాణంలో విక్రయిస్తున్నారు. సెల్ టవర్ బ్యాటరీలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు అందుకున్న గజ్వేల్ పోలీసులు టెక్నాలజీ సాయంతో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 98 వేల నగదుతో పాటు 23 బ్యాటరీలు, 4 సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనం, 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. వీరందరినీ 11 కేసుల్లో జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించినట్లు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులను సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అభినందించారు.

పుట్టిన రోజు వేడుకలకు వెళ్లొస్తుండగా..

- డివైడర్, లారీని ఢీకొట్టిన కారు
- వ్యక్తి మృతి, ఇద్దరికి గాయాలు

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కోహీర్ మండల పరిధిలో గల చింతల్‌ఘాట్ గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ సతీష్ కుమార్ కథనం మేరకు.. పటాన్‌చెరుకు చెందిన సామ అశోక్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు ఇద్దరు మిత్రులతో కలిసి కోహీర్ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి కారులో వచ్చాడు. వేడుకల ముగిశాక తిరుగు ప్రయాణంలో పటాన్‌చెరుకు వెళ్తున్నారు. చింతల్‌ఘాట్ గ్రామ పరిధిలో 65 జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొని అనంతరం లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


జహీరాబాద్ టౌన్: ప్రమాదంలో దెబ్బతిన్న కారు

బైక్ అదుపుతప్పి..

సంగారెడ్డి క్రైమ్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సంగారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. నర్సాపూర్ మండలం సీత్యాతండాకు చెందిన ముడతల దేవిసింగ్ (35) మంగళవారం ఉదయం పోతిరెడ్డిపల్లి నుంచి బైక్‌పై సంగారెడ్డికి వస్తున్నాడు. సంగారెడ్డిలోని సీఎస్‌ఐ చర్చ్ ఆవరణలోకి రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్సు ఢీకొని వ్యక్తి..

చిన్నశంకరంపేట(మెదక్): బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నార్సింగి మండలం వల్లూర్ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వల్లూర్ గ్రామానికి చెందిన వడ్ల రమేశ్(45) చేగుంటకు వెళ్లి సైకిల్‌పై గ్రామానికి తిరిగొస్తున్నాడు. వల్లూర్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా నిజామాబాద్ వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ అహ్మద్ మోహినొద్దీన్ తెలిపారు.